క్లుప్తంగా

రోగులకు బల్లలు, కుర్చీల వితరణ

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా ముందుకు సాగుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం పాత ఓపీ విభాగం వద్ద రోగులు వీక్షించేలా రెండు టీవీల ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాత ఓపీ బ్లాక్ వద్ద గతంలో ఓపీ తీసుకోవాలంటే ఎంతో కష్టంగా ఉండేదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని 11 ఓపీ కేంద్రాలను ప్రారంభించామన్నారు. రోగుల సహాయకులు వేచి ఉండేలా రేకుల షెడ్డును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ల్యాబ్ పరీక్షల కోసం కొత్తగా కౌంటర్ లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పట్టపు గోపి సహకారంతో రోగులు కూర్చునేలా ఇనుప బల్లలు, కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. లయన్స్‌క్లబ్ అఫ్ గుంటూరు సహకారం తో రోగులు కూర్చునేందుకు సిమెంట్ బల్లలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలి



పట్నంబజారు: డ్రైవర్లు బస్సు నడిపే సమయంలో తన చేతుల్లో ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని గుర్తించి డ్రైవింగ్ చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని కంట్రోల్ రూము వద్ద మంగళవారం గేట్‌మీటింగ్ నిర్వహించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అనే నినాదంతో ఏర్పాటు చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్‌ఎం రవికాంత్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డీజిల్ ఆదా చేసి తద్వారా సంస్థ ఆర్థిక స్థితి మెరుగు పరిచేందుకు పాటుపడాలని సూచించారు. అదే విధంగా సిబ్బంది ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని సూచించారు.

కారు ఢీకొని గోవు మృతి

పట్నంబజారు: మద్యం మత్తులో అతివేగంగా కారు నడిపి గోవు మృతికి కారణమై, ద్విచక్రవాహనాలు ధ్వంసమైన ఘటనలో వ్యక్తిపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. భావోజీనగర్‌కు చెందిన షేక్ అర్షద్ అలి సోమవారం అర్ధరాత్రి సమయంలో పూటుగా మద్యం తాగి తన నివాసానికి కారులో వెళుతున్నాడు. అతివేగంగా వెళ్తూ రోడ్డుపై నిద్రిస్తున్న గోవును ఢీకొట్టాడు. గోవు ఘటనా స్థలంలోనే మృతి చెందింది. అనంతరం అదుపు తప్పిన కారు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలను ఢీకొంటూ గోడను ఢీకొట్టాడు. దీంతో రెండు బైక్‌లు ధ్వంసం అయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో మూడు ఎయిర్‌బెలూన్లు ఓపెన్ అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, గోమాతకు అంత్యక్రియలు నిర్వహించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేట 30వ వార్డులోని ఉడా పార్కులో ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు నేతృత్వంలో ఏఎస్‌ఐ హైదర్‌అలీ, పీసీలు పి.మురళి, జి.శ్రీనివాసరావు, జి.నరేంద్ర ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసుల రాకను గమనించి ఆరుగురు వ్యక్తులు పరారయ్యేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. వీరిని గంగానమ్మపేటకు చెందిన అంగిరేకుల గంగాధరరావు, కఠెవరంకు చెందిన పల్లెకొండ దుర్గాప్రసాద్, చెంచుపేట ఇందిరా కాలనీకి చెందిన గద్దం ప్రసాద్, సుందరయ్య కాలనీలో ఉంటున్న షేక్ సైఫా, తెనాలి వీఎస్సార్ కళాశాల కాల్వ కట్ట వద్ద నివసించే అరవపల్లి భువనేశ్వర్, యడ్ల లింగయ్య కాలనీకి చెందిన జానవరపు తేజలుగా గుర్తించారు. వీరిలో గంగాధరరావు, దుర్గాప్రసాద్ విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి వద్ద 1,100 గ్రాముల గంజాయిని రూ.22 వేలకు కొనుగోలు చేసి తెనాలి తీసుకువచ్చి మిగిలిన వారితో కలసి కొంత వాడుకుని మిగిలినది విక్రయించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ లోగా పోలీసులకు సమాచారం అందడంతో పట్టుబడ్డారని డీఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి 1,100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

డాక్టర్ సాయిపవన్‌కు గోల్డ్ మెడల్ ప్రదానం

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సంద్భంగా స్థానిక బోస్‌రోడ్డులోని కార్యాలయంలో ప్రత్యేక సభను సోమవారం రాత్రి నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎ.సాయిపవన్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆధునిక వైద్య విధానంలో గుండె శస్త్ర చికిత్సల గురించి వివరించారు. ఈ సంద్బంగా డాక్టర్ సాయిపవన్‌కు డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ధార్మిక గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె.అనిల్‌కుమార్, డాక్టర్ మధుప్రభాకర్ బాబు, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ బీసీహెచ్ సాంబిరెడ్డి పాల్గొన్నారు.

వారెవ్వా... మెటా!

- వాట్సాప్‌లో కన్పిస్తున్న కొత్త ఫీచర్
- ఏ సమాచారం కావాలన్నా క్షణాల్లోనే పొందే వెసులుబాటు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో 'మెటా' దూకుడు

నెహ్రూనగర్: సాంకేతిక దూకుడు పెరిగిన ప్రస్తుత రోజుల్లో దాదాపు అన్ని రంగాల్లో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– ఏఐ) వినియోగం అనివార్యంగా మారింది. ఈ కామర్స్ మొదలు సోషల్ మీడియా వరకూ అన్ని రంగాలు ఏఐని ఉపయోగిస్తున్నాయి. ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురాగా.. తాజాగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా అదే దూకుడును ప్రదర్శిస్తోంది. ఎక్కువ మంది ఉపయోగిస్తున్న మెసేజింగ్ యాప్ వాట్సాప్ తాజాగా ఏఐ రంగంలోకి కూడా అడుగు పెట్టింది. ప్రస్తుతం ఏఐ టెక్నాలజీకి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో మెటా కూడా ఆ దిశగా అడుగులు వేసింది. ఇందులో భాగంగా 'మెటా ఏఐ' పేరుతో కొత్త ఫీచర్‌ను పరిచయం చేసింది. వారం రోజులుగా ఇప్పుడు వాట్సాప్ ఓపెన్ చేయగానే చాలా మంది స్మార్ట్ ఫోన్లలో రౌండ్ షేప్‌లో ఓ సింబల్ కన్పిస్తోంది. అదే మెటా ఏఐ!

ఎలా పనిచేస్తోందంటే..

మెటా తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్ అచ్చం చాట్ జీపీటీలా పని చేస్తోంది. వాట్సాప్ ఓపెన్ చేయగానే మీ సెల్‌ఫోన్‌లో కన్పించే రౌండ్ సింబల్‌ను క్లిక్ చేసిన తర్వాత టరమ్స్ అండ్ కండీషన్స్ యాక్సెప్ట్ చేయగానే మెటా ఏఐ విత్ లామా అనే చాటింగ్ పేజీ చాటింగ్ పేజీ ఓపెన్ అవుతుంది. మీ ఫ్రెండ్ లేదా ఇంకెవరితోనైనా ఎలాగైతే చాట్ చేస్తామో అలాగే మెటా ఏఐ ద్వారా కూడా చాట్ చేయచ్చు. మీకు ఏ సమాచారం కావాలన్నా అందులో టైప్ చేసి సెండ్ చేయగానే క్షణాల వ్యవధిలోనే మీరు కోరిన సమాచారం లభిస్తుంది.

ఉదాహరణకు గుంటూరులో బెస్ట్ లాడ్జి ఏది? అని అడిగితే వెంటనే అందుకు సంబంధించిన లిస్ట్ ప్రత్యక్షమవుతుంది. తిరుమలలో అద్దె గది పొందడం ఎలా అని అడిగితే సమాచారం వస్తుంది. అలాగే మీకు ఇంకేదైనా ఫొటో కావాలన్నా క్షణాల్లో అందిస్తుంది. తాజాగా రిలీజ్ అయినా సినిమా వివరాలు కావాలన్నా తెలుసుకోవచ్చు. 'ఇమాజిన్ కార్ రేస్ ఆన్ మార్స్' అని టైప్ చేసినా కూడా వెంటనే



మార్స్‌పై నిజంగా కార్ రేస్ జరిగితే ఎలా ఉంటుందో ఆ ఫొటో మీకు అందిస్తుంది. విద్య మొదలు వైద్యం వరకూ టెక్నాలజీ నుంచి సైన్స్ వరకూ ఇలా అన్ని రకాల ప్రశ్నలకు మెటా ఏఐ మనకు సమాధానాలిస్తుంది. ఇండియా ప్రస్తుత ప్రధాని ఎవరూ? అలాగే ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి ఎవరు? అనే ప్రశ్నలు అడిగినా తాజా సమాచారం మనకు మెటా ఏఐ అందిస్తుంది. అయితే ప్రస్తుతం ఇంగ్లిష్‌లో మాత్రమే సమాచారం ఇస్తోంది. రానున్న రోజుల్లో మాతృభాషలో కూడా అందిస్తారేమో చూడాలి.

క్షణాల్లో సమాచారం



తాజాగా వాట్సాప్ ద్వారా వచ్చిన కొత్త ఫీచర్ మెటా ఏఐని నేను ఉపయోగిస్తున్నా. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఏ సమాచారం కావాలన్నా గూగుల్‌కి వెళ్లి సర్చ్ చేసే పని లేకుండా వాట్సాప్ లోనే క్షణాల్లోనే అందిస్తోంది. ఏఐకి మంచి ఉజ్వల భవిష్యత్ ఉంది.

–యు.శ్రావణ్ కుమార్, ఐటీ ఉద్యోగి

సమాజానికి వైద్యులు, సీఏలు ఎంతో కీలకం

అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు



వైద్యులను సత్కరించిన అవోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజానికి వైద్యులు, సీఏలు ఎంతో కీలకమని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో మంగళవారం పలువురు వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను సత్కరించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రతి మనిషికి అవసరమైన రెండు ముఖ్యమైనవి ఆరోగ్యం – సంపద అని, మన ఆరోగ్యాన్ని సంరక్షించే వైద్యులతో పాటు మన సంపదను ఏలా ఉపయోగించేకోవాలనే సలహాలను ఇచ్చే సీఏలను సన్మానించుకోవడం మన అదృష్టమన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఈ వైద్య వృత్తిని అంకితభావంతో నిర్వహించాలని అన్నారు. ఈసందర్భంగా 18 మంది వైద్యులతో పాటు ఆరుగురు సీఏలను సత్కరించారు. కార్యక్రమంలో శంకర నేత్రాలయ వైద్యుడు పొట్టి సుధాకర్, అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయి రమేష్, ప్రోగ్రాం కన్వీనర్లు డాక్టర్ రామ్‌కుమార్, దేవరశెట్టి అమర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సలహాలు, సూచనలు తీసుకోండి

రైల్వే డీఆర్‌ఎం రామకృష్ణ



శంకర్‌కు ఉద్యోగోన్నతి పత్రం అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: రైల్వే శాఖలో ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగుల సలహాలు సూచనలు రైల్వే శాఖకు అందజేయాల్సిందిగా గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జూన్‌లో 14 మంది రైల్వే సిబ్బంది పదవీ విరమణ చేశారన్నారు. పదవీ విరమణ చేసిన సిబ్బంది స్థానంలో కింది స్థాయి సిబ్బందికి పదోన్నతి ఉత్తర్వులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా ఉద్యోగ విరమణ సిబ్బంది స్థానంలో పదోన్నతి పొందిన సిబ్బందితో కలిపి మొత్తం డివిజన్ పరిధిలో 77 మంది రైల్వే సిబ్బందికి ఈ నెలలో పదోన్నతి దక్కిందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాల్సిందిగా కోరారు. నిత్యం యోగా, వాకింగ్ వంటివి చేస్తూ ఆరోగ్యాన్ని రక్షించుకోవాల్సిందిగా తెలిపారు. ప్రధానంగా రైల్వే శాఖ వారి విభాగాలలో తోటి సిబ్బందికి అవసరాన్ని బట్టి సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా సూచించారు. అనంతరం సిబ్బంది పదవీ విరమణ చేసిన వెంటనే వారి పదోన్నతులు అమలులోకి వచ్చినందుకు పదోన్నతి పొందిన సిబ్బంది డీఆర్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే డీఆర్‌ఎం రామకృష్ణ సమక్షంలో ఉద్యోగ విరమణ పొందిన వినుకొండ కమర్షియల్ విభాగం సూపరింటెండెంట్ భవనీ శంకర్ చేతుల మీదుగానే ఆయన స్థానంలో పదోన్నతి పొందిన శంకర్‌కు పదోన్నతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, సీనియర్ డీపీఓ షహబాజ్ హనూర్, ఏపీఓ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

మోటారు వాహనాల చట్టాలను రద్దు చేయాలి

తాడికొండ అడ్డరోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



తాడికొండ: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మోటారు వాహనాల చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చట్టాలకు నిరసనగా మంగళవారం తాడికొండ అడ్డరోడ్డులో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆలిండియా రోడ్ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మోటారు వాహనాల చట్టంలో మార్పు చేస్తూ చిన్న చిన్న పొరపాట్లకు డ్రైవర్లు భారీ మొత్తంలో పెనాల్టీలు, జైలు శిక్షలు విధించాలని చూస్తుందన్నారు. వాహనం ఏదైనా ప్రమాదానికి గురైనపుడు మనిషి చనిపోతే వాహనం నిర్లక్ష్యంగా నడిపాడు అని, డ్రైవర్ పారిపోయాడు అని ఎఫ్‌ఐఆర్‌లో నమోదైతే 5–10 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమాన విధించాలని న్యాయ సంహిత బీఎన్ఎస్ 106 లాంటి ప్రమాదకరమైన చట్టాలు తీసుకొచ్చారని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన పదేళ్లలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యావసర సరుకుల ధరలు పెంచడం, మోటారు వాహనాల స్పేర్ పార్టులపై జీఎస్టీ, ఇన్సూరెన్స్ ప్రీమియం, రోడ్ ట్యాక్స్, గ్రీన్ టాక్స్, పెంచడంతో పాటు రోడ్లు ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడం మొత్తం రవాణా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు విపరీతంగా పెంచిందని, పెంచిన ఫీజులు, పెనాల్టీలు న్యాయ సంహిత 106 లాంటి చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, రైతు సంఘం నాయకులు కనగాల పూర్ణయ్య, చింతల భాస్కరరావు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

తాడేపల్లిరూరల్: డిగ్రీ చదివిన విద్యార్థులు, నిరుద్యోగులకు మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని మానవ సేవా సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, ప్రకాశం, కృష్ణా, ఎన్‌టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని డిగ్రీ చదివిన విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సాఫ్ట్‌వేర్ కోర్సు (ఎస్ఏపీ ఎస్‌డీ) శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లా విద్యార్థులకు మంగళగిరిలోని రత్నాల చెరువు అండర్ పాస్ వద్ద ఉన్న వీఆర్ కాంప్లెక్స్‌లోని మానవ సేవా సంస్థ కార్యాలయం, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టీఆర్ జిల్లాల విద్యార్థులకు తాడేపల్లి పట్టణ పరిధిలోని కుంచనపల్లి డిపార్ట్ పక్కన, రామ్ స్నేహ ఎవెన్యూస్, ప్లాట్ నెం. 208లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని తెలిపారు. శని, ఆదివారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కోర్సు కాలపరిమితి 3 నెలలు, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా నమోదు చేసుకున్న విద్యార్థులను మాత్రమే శిక్షణ తరగతులకు అనుమతిస్తామని, సర్వీస్, మెటీరియల్ ఖర్చులు విద్యార్థులు చెల్లించాలన్నారు. వివరాలకు 70935 29750, 99852 22857 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మంగళవారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరంలో 442 మంది పరీక్షలు చేశారు. పెదకాకాని శంకర ఐ హాస్పిటల్ వైద్యులు పరీక్షలు చేశారు. వైద్యులు నేత్ర పరీక్షలు నిర్వహించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. సంస్థ సభ్యుల విజ్ఞప్తి మేరకు ప్రతి ఆరు నెలలకొకసారి ఉచిత నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించడానికి శంకర్ ఐ హాస్పిటల్ యాజమాన్యం అంగీకరించినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటరావు, ఎస్.శ్రీనివాస్, ఎల్.మురళీకృష్ణ, సత్యనారాయణ, వైద్యులు, శంకర్ హాస్పిటల్ పీఆర్వో పి.ఎస్.ఎల్.కాశీప్రసాద్, ఐ బ్యాంక్ కో ఆర్డినేటర్ సురేంద్ర పాల్గొన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

పట్నంబజారు: యువకుల మధ్య స్వల్ప ఘర్షణ గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం సమయంలో పూటుగా మద్యం తాగి మత్తులో ఉన్న కొంత మంది యువకుల మధ్య లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఏలూరు బజారులో ఘర్షణ జరిగింది. యువకులు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని సర్దిచెప్పిన వినకపోవడంతో యువకులను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నట్లు సమాచారం.

బావిలో పడి యువకుడి మృతి

పట్నంబజారు: ప్రమాదవశాత్తు నూతిలోపడి యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఆర్.అగ్రహారంలోని దళవాయి వీధిలో నివాసం ఉండే కర్లపాలెం సాయితేజస్వి(22) బావి వద్ద ఇటుక రాళ్లు ఉండటంతో సర్దుతూ ప్రమాద వశాత్తు అందులో పడి మృతిచెందాడు. మృతుడు మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. ప్రమాద వశాత్తు జరిగిన ఘటనపై మృతిచెందినట్లు తండ్రి రత్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

గుంటూరుఈస్ట్: మున్సిపల్ కార్పొరేషన్ స్థలంలో ఇద్దరు అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణనగర్ 2వలైనులోని మున్సిపల్ కార్పొరేషన్ స్థలం ప్రహరీని చల్లా శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పగులగొట్టారు. స్థలంలోకి ప్రవేశించి చెట్లను నరికారు. ఘటనపై మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ప్లానింగ్ సెక్రటరీ శివసాయితేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందించాలి

చేబ్రోలు: విద్యార్థులందరికీ సకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంను అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. చేబ్రోలు మండలంలోని స్టూడెంట్ కిట్స్ పంపిణీ, పీఎం పోషన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు స్టూడెంట్ కిట్ పంపిణీ, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ గురించి వివరాలు తెలుసుకున్నారు. అదనంగా అవసరమైతే జిల్లా స్థాయి డిపో నుంచి తీసుకొని వివిధ పాఠశాలల నుంచి నూతనంగా చేరిన విద్యార్థులకు కూడా వెంటనే అందజేయాలని తెలిపారు. వేజండ్ల జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు తెలుగు చదవడం, రాయడం గురించి బాగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం జాగ్రత్త తీసుకోవాలని సీజనల్ వ్యాధులపై తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యలో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించా. ఆమె వెంట ఎంఈఓ రాయల సుబ్బారావు, హెచ్‌ఎం విజయశ్రీ, ఏం ఏడుకొండలు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సామాజిక సేవలు ప్రశంసనీయం



డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న ఐఎంఏ నేతలు



డాక్టర్ సురేష్‌కుమార్‌కు సన్మానం

గుంటూరు మెడికల్: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఐఎంఏ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ బంగ్లారోడ్డులోని ఐఎంఏ హాలులో విశిష్ట సేవలందించిన వైద్యులకు సోమవారం రాత్రి సన్మాన సభ నిర్వహించారు. సభలో ఐఎంఏ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ కే సురేష్ కుమార్, డాక్టర్ ఈదర కృష్ణమూర్తి ప్రత్యేక విభాగాలలో అందించిన వైద్య, ఇతర సామాజిక సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. సైకియాట్రిస్ట్‌గా డాక్టర్ సురేష్ కుమార్ వైద్యునిగా అధ్యాపకునిగా, ఆచార్యునిగా బహు ముఖ ప్రజ్ఞను కనబరిచారన్నారు. డాక్టర్ ఈదర కృష్ణమూర్తి మధుమేహం చికిత్స, ముందు జాగ్రత్తలతో మధుమేహాన్ని నిరోధించటంలో ప్రజల్ని చైతన్యవంతులు చేయడంలో ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. వారి సేవలను గుర్తించే ఐఎంఏ గుంటూరు శాఖ ఈ సంవత్సరం సన్మాన కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సురేష్ కుమార్ సోషల్ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా పరిచయస్తులని పేర్కొన్నారు. సన్మాన గ్రహీత డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ తన తండ్రి డాక్టర్ కేజీకే గుప్త స్ఫూర్తితో జీవితంలో ఎన్నో విజయాలు సాధించానన్నారు.

ఈదర కృష్ణమూర్తి మాట్లాడుతూ తన సొంత జిల్లా ఒంగోలులో స్థిరపడాల్సిన నేను గుంటూరులోని మిత్రులు, బంధువుల ప్రభావంతో ఇక్కడే ఉండి పోవాల్సి వచ్చిందన్నారు. గుంటూరు వైద్యులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. డాక్టర్ పి.వి.రాఘవ శర్మ, డాక్టర్ పి.విజయ అందించిన సహకారం నా జీవితాన్ని మలుపు తిప్పిందన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరుశాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ జి.బాబూరావు, డాక్టర్ సిహెచ్.విశ్వేశ్వరరావు, డాక్టర్ వైవీఎస్ ప్రభాకర్, డాక్టర్ పీవీ రాఘవ శర్మ, డాక్టర్ పి.విజయ, డాక్టర్ ఐవీఎల్ నరసింహారావు, జీఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజయ్, కార్యదర్శి డాక్టర్ జి.రాజేష్ సన్మాన గ్రహీతల కుటుంబ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

డాక్టర్ కిరణ్‌కుమార్‌కు పలువురు అభినందనలు



గుంటూరు మెడికల్: గుంటూరు పభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ఏడాదిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. సూపరింటెండెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తి చేసిన సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది మంగళవారం అభినందనలు తెలిపారు. రోగుల సహాయకునితో కలసి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందా నాయక్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం కార్యదర్శి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రతిరోజూ వార్డుల్లో తిరుగుతూ వైద్యులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడంలో ఎంతో బాధ్యతగా చేశారని కొనియాడారు. సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ డాక్టర్ బత్తులవెంకట సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టారని చెప్పారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.5 కోట్ల తో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రూ.4 కోట్లతో సీటీ స్కాన్‌ను అందుబాటులోకి తీసుకుని వస్తున్నామని చెప్పారు.

సర్పంచి మహేష్ మరణం పార్టీకి తీరని లోటు

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మాజీ మంత్రి సుచరిత, దయాసాగర్



మహేష్ కుటుంబానికి ధైర్యం చెబుతున్న మేకతోటి సుచరిత దంపతులు

కంతేరు(తాడికొండ): కంతేరు గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు మరణం వైఎస్సార్ సీపీకి, అతని కుటుంబానికి తీరని లోటు అని మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత, విశ్రాంత ఐటీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ దంపతులు అన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన మహేష్ మృత దేహాన్ని మంగళవారం సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మహేష్ అందరి గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారన్నారు. కుటుంబానికి అండగా నిలిచి, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వారి వెంట పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మంగళగిరి: నీట్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం గురువారం నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ నీట్‌ను రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వాలే పరీక్షలు నిర్వహించుకునేలా ఆదేశాలివ్వాలని, జీఓ నంబరు 77ను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయాలన్నారు. నీట్ నిర్వహణలో విఫలమైన కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పఠాన్ సమీర్, మూలం సాయి, వలపర్ల శైలేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ ఎంపికలో ఎస్వీవీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం అడ్డగడ్డ వీర వరప్రసాద్, పీఈటీ సుంకర శ్రీనివాస్

తాడికొండ: జిల్లా స్విమ్మింగ్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నలుగురు ఎంపికైనట్లు తాడికొండ ఎస్వీవీ హైస్కూల్ హెచ్‌ఎం అడ్డగడ్డ వీర వరప్రసాద్, పీఈటీ సుంకర శ్రీనివాస్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా స్విమ్మింగ్ జట్టు ఎంపికలో భాగంగా గుంటూరు జిల్లా అక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులోని నెక్స్ట్ జెన్ పాఠశాలలోని స్విమ్మింగ్ పూల్‌లో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు మార్కపూడి రామ్ ప్రకాష్, తుపాకుల వీరాంజనేయులు, షేక్ ఫయాజ్, పఠాన్ ఖాజా మస్తాన్‌వలి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఎంపికై నట్లు తెలిపారు. 50 మీటర్లు, 100 మీటర్లు, 100 మీటర్ల ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్‌లలో వివిధ ఏజ్ గ్రూపుల ఈత పోటీల్లో పాల్గొని జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు ఈ నెల 13 –14 వ తేదీల్లో కర్నూలులోని ఏపీ అమెట్యూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే స్టేట్ మీట్ పోటీలలో పాల్గొనేందుకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ అందించిన గుంటూరు సీనియర్ స్విమ్మింగ్ కోచ్ షేక్ ఖాజా మోహిద్దిన్, ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుంకర శ్రీనివాస్‌లను అభినందించారు.